నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 13 నవంబర్ 2024 | NALGONDA

మధ్యాహ్న భోజనం చేస్తూ హాస్టల్ సమస్యలు తెలుపుతున్న విద్యార్థులు

అన్నంలో పురుగులు వస్తున్నాయి

- నీళ్ల సాంబారు, మజ్జిగ పోస్తున్నారు..
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను వెంటనే మార్చాలి
- విచారణ అధికారికి సమస్యలు తెలిపిన తుంగతుర్తి గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు

తుంగతుర్తి, నవంబర్ 12 : మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. కొన్ని రోజులుగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో పాఠశాలకు మంగళవారం విచారణ అధికారిగా జనంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజా విచారణ చేపట్టారు. ఈమేరకు పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని జరిగిన ఘటనను వివరించారు. అనంతరం విచారణ అధికారి అధ్యాపకులను, విద్యార్థులను వేర్వేరుగా విచారణ చేయడంతో అందరూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. ఈసందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని ఆయన ఖంగుతిన్నారు. కొన్ని రోజులుగా రెగ్యులర్ అధ్యాపకులు లేక పాఠశాలలో విద్యాబోధన సరిగా లేదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, అన్నంలో తరచూ పురుగులు వస్తున్నాయని, నీళ్ల సాంబారు, నీళ్ల మజ్జిగ పోస్తున్నారని, కొన్ని సందర్భాల్లో భోజనం సరిపోను అందడం లేదని విద్యార్థులు తెలిపారు. తమ సమస్యలపై కలెక్టర్ స్పందించి పరిష్కరించాలని వేడుకున్నారు. దీంతో సదరు వంట కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా పాఠశాలలో 550మందికిపైగా విద్యార్థులు ఉండగా వార్డెన్ సరిపోను సరుకులు ఇవ్వడంలేదని ఆరోపించారు. అనంతరం విచారణ అధికారి రాజా మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విచారణ చేపట్టానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని తెలిపారు.

విచారణ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తండ్రులు

సూర్యాపేట రూరల్ : బాలెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

48 గంటల్లో ధాన్యం డబ్బులు జమ కావాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట రూరల్, నవంబర్ 12 : ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండల పరిధిలోని పిల్లలమర్రి, బాలెంల, రామన్నగూడెం గ్రామాల్లో మంగళవారం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లులకు రవాణా దిగుమతి వేగంగా జరుపాలని, ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటిప్పుడు చేయాలని తెలిపారు. రైతులకు 48గంటల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఓ కృష్ణసందీప్ ఉన్నారు.

సూర్యాపేట మార్కెట్‌లో నేటి నుంచి టోకెన్ విధానం

సూర్యాపేట టౌన్, నవంబర్ 12 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం అధికంగా వస్తుండడంతో కాంటాలు, ఎగుమతులకు ఇబ్బందులు కలుగకుండా సోమవారం నుంచి టోకెన్ విధానం అమలు చేస్తున్నట్లు మార్కెట్ సెక్రటరీ సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు టోకెన్ ఇచ్చి వరసుగా ధాన్యాన్ని మార్కెట్‌లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ రాత్రి 12గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8గంటల వరకు మాత్రమే రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లోకి తీసుకురావాలని, 8గంటల తరువాత వచ్చే ధాన్యాన్ని రాత్రి 12గంటల తరువాత మాత్రమే మార్కెట్‌లో పోయిస్తామని తెలిపారు. రైతులు, వ్యాపారులు, కమీషన్‌దారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అమాత్యా.. జర ఇటు చూడుర్రి

ధాన్యం, పత్తి కొనుగోళ్ల లో తీవ్ర జాప్యం

- మద్దతు ధరకు ఎసరు... రైతన్నలను నిలువు దోపిడీ
- ప్రభుత్వ తీరుపై నిత్యం రోడ్లెక్కుతున్న రైతులు
- సమీక్ష పట్టని ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు
- కాంగ్రెస్ నేతల విజ్ఞప్తికి స్పందించని మంత్రులు
- ప్రభుత్వ పెద్దల తీరుపై రైతుల మండిపాటు

వానకాలంలో పండించిన పంటలను అమ్ముకునేందుకు గత నెల రోజులుగా ఉమ్మడి జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎటు చూసినా ఓ వైపు ధాన్యం రాశులు, మరోవైపు పత్తి బోరాలు కనిపిస్తున్నాయి. కానీ వాటికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలంటే సవాలక్ష కొర్రీలు ఎదురవుతున్నాయి. ఇటు మిల్లర్లు ధాన్యం రైతును, అటు సీసీఐ సెంటర్ల నిర్వాహకులు పత్తి రైతును దగా చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఎలా ఎగనామం పెట్టడమే లక్ష్యమన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళ నకు గురవుతున్నారు. ఇలాంటి సమయాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షిస్తూ అండగా నిలవాల్సింది ప్రభుత్వ పెద్దలే. గత కేసీఆర్ సర్కార్‌లో ప్రతి సీజన్‌లోనూ నాటి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఇతర మంత్రులు జిల్లాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగంతో సమీక్షించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్‌లోని మంత్రులకు ఆ తీరిక దొరకడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కాంగ్రెస్ మీటింగ్‌లోనూ ఆ పార్టీ నేతలే కొనుగోళ్లపై వ్యక్తం చేసిన ఆవేదన వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అయినా సరే జిల్లాలోని ఇద్దరూ మంత్రులతో పాటు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నా...నేటికి ఒక్కసారి కూడా పంటల కొనుగోళ్లపై సమీక్ష జరుపకపోవడం ఏంటని రైతులు మండిపడుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్12(నమస్తే తెలంగాణ)

మర్రిగూడ : పత్తి కొనుగోళ్లపై నిబంధనలతో యరగండ్లపల్లి లక్ష్మీనర్సింహ స్వామి కాటన్ మిల్లు ఎదుట రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవహరిస్తున్నారు. ఇక నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇందులో ఇన్‌చార్జి మంత్రి తుమ్మలతోపాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాఖలు కూడా నేరుగా రైతులు, పంటల ఉత్పత్తులతో సంబంధం ఉన్న శాఖలే. అయినా సరే వీరిలో ఎవ్వరికీ కూడా నేటికి ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యంగానీ, పత్తి కొనుగోళ్లపైగానీ సమీక్షించే తీరిక దొరకడం లేదు. రాష్ట్రంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా ధాన్యం, పత్తి పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుతం ధాన్యం, పత్తి పంటలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. వడ్ల కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా దొడ్డురకం వడ్ల కొనుగోళ్లు ఓ మాదిరిగా జరుగుతుండగా సన్నవడ్లు మాత్రం ప్రభుత్వ నిబంధనలతో కేంద్రాలకు రావడం లేదు. దీంతో సన్నవడ్లను పండించిన రైతులు నేరుగా రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 6.81లక్షల ఎకరాల్లో సన్నాల సాగుకు అంచనా వేయగా 15.50లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి సన్నాలను రైతులు మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లులకే తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు నాన్‌ఆయకట్టు సన్నాలు రాగా ఇక నుంచి సాగర్ ఆయకట్టులోని సన్నాలు మార్కెట్‌కు భారీ ఎత్తున రానున్నాయి. ఆరంభంలో రూ.2400 వరకు సన్నాలకు ధర చెల్లించిన రైస్‌మిల్లర్లు ధాన్యం భారీగా ముంచెత్తుతుండడంతో ఇదే అదునుగా ధరను తగ్గించి వేస్తున్నారు. రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా మారి క్వింటాలు సన్నవడ్లకు రూ.2,150 నుంచి రూ.2,300 వరకే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వానకాలంలో అత్యధికంగా రూ.2,800 నుంచి రూ.3,150 వరక కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం ధరను భారీగా తగ్గించడంలో రైతులు రగిలిపోతున్నారు. దీంతో రైస్‌మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్లెక్కుతున్నారు. రైతుల ఆందోళనతో అధికారులు స్పందించడంతో మిల్లర్లు కొద్ది సేపు దిగి వస్తున్నా.. తర్వాత యథావిధిగా ధరలో కోతలు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారు.

పత్తి కొనుగోళ్ల లోనూ కొర్రీలు

ఇక ఇదే సమయంలో పత్తి రైతులు సైతం నిలువు దోపిడీకి గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 7 క్లస్టర్లలో 23 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు జరుపుతున్నట్లు ప్రకటించినా ఆచరణలో పరిస్థితి వేరుగా ఉంది. కొన్ని మిల్లులకే సీసీఐ అనుమతించడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొనుగోళ్లు జరుపుతున్న జిన్నింగ్ మిల్లుల్లో సైతం తేమ పేరుతో సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లల్లో కొర్రీలు పెడుతున్నారు. 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే మద్దతు ధర రూ.7521లు చెల్లిస్తామంటున్నారు. కానీ ఇటీవల తుఫాన్ వర్షాల కారణంగా పత్తి నాణ్యతతో పాటు తేమ శాతం కూడా ఎక్కువగా ఉంటుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో గ్రామాల్లోని దళారులకు పత్తిని క్వింటాలుకు రూ.5,800 నుంచి రూ.6,300 వరకే విక్రయించాల్సి వస్తుంది. సీసీఐ తీరుతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద నిత్యం పత్తి రైతుల ఆందోళనలు నిత్యకృత్యంగా మారాయి. రానున్న నెల రోజులు ధాన్యం, పత్తి పంటల దిగుబడి మరింత పెరగనుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సి ఉంది. అధికారులు ఆడపాదడపా స్పందిస్తూ వారికి ఉన్న పని ఒత్తిళ్లతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారన్న చర్చ ఉంది.

మంత్రులు అంత బిజీనా..

జిల్లా మంత్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కూడా రైతుల బాధలు పట్టనంత బిజీ ఏముంటుందన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది. పంటలు అమ్ముకునే సమయాల్లో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలుగా మంత్రులకు ఎందుకు పట్టడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మద్దతు ధర రాక, కొనుగోళ్లు సజావుగా సాగక నిత్యం రైతులు రోడ్లెక్కుతున్న వార్తలు మీడియాలో వైరల్‌గా మారినా మంత్రులు స్పందించకపోవడం ఏంటని రైతులు మండిపడుతున్నారు. మరోవైపు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలోనే ఆ పార్టీ నేతలు ధాన్యం రైతుల బాధలు వర్ణనాతీతం అంటూ... గత ప్రభుత్వంలో వారం రోజుల్లోనే ధాన్యం డబ్బులు పడేవని... జిల్లాకు చెందిన మంత్రే సివిల్ సప్లయ్ మంత్రిగా ఉన్నా నెల రోజులుగా పంటలు అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయినా జిల్లా మంత్రుల్లో చలనం లేకపాయే అని ఆ పార్టీ శ్రేణులే ఆరోపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వానకాలం పంటలకు రైతుభరోసాకు ఎగనామం పెట్టారు... రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు... పండించిన ధాన్యం మొత్తానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడేమో సన్నవడ్లకే అని మెలిక పెట్టారు. ప్రభుత్వతో.డ్పాటు కరువైనా సరే.. పండించిన పంటల కొనుగోళ్లు సజావుగా జరిగేలా, వాటికి మద్దతు ధర లభించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి లేదా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ ఆలస్యం.. రైతులపై ₹51 కోట్ల భారం

ప్రతి నెలా రూ.17 కోట్ల చొప్పున వడ్డీ

- సూర్యాపేట జిల్లాలో ఇప్పటి వరకు 51 శాతం మందికే రుణమాఫీ
- ఇంకా మాఫీ కావాల్సింది రూ.2వేల కోట్లు
- రూ.రెండు లక్షలకు పైగా రుణంపై వడ్డీ చెల్లించినా కాని మాఫీ
- ప్రభుత్వం మాట తప్పడంతో అన్నదాతల అవస్థలు

ప్రభుత్వం రుణమాఫీ ఆలస్యం చేస్తుండడంతో రైతులపై నెలనెలా వడ్డీ రూపంలో భారం పడుతున్నది. ఇప్పటివరకు రూ.లక్ష, రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్న వారిలో సగం మందికే రుణమాఫీ అయ్యింది. మిగతావారు మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రూ. రెండు లక్షలపైన రుణం వారు వడ్డీ చెల్లించాలని ప్రభుత్వం చెప్పడంతో వారు చెల్లించి మాఫీ కోసం చూస్తున్నారు. కానీ ప్రభుత్వం మాట తప్పి వ్యవహరిస్తున్నది. దాంతో రైతులపై వడ్డీ భారం పడుతున్నది. సూర్యాపేట జిల్లాలో నెలకు రూ.17 వేల చొప్పున మూడు నెలల్లో వడ్డీ రూపంలో 51 కోట్ల అదనపు భారం పడుతున్నది. జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల మంది రైతులు దాదాపు 3వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకోగా ఇప్పటి వరకు మూడు విడుతల్లో 1,00,583 మంది రైతులకు రూ.837 కోట్లు మాత్రమే మాఫీ చేశారు. ఈ లెక్కన జిల్లాలో దాదాపు రూ.2,160 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నది.

- సూర్యాపేట, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ)

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తున్నట్లు ఎంతో ఆర్భాటం చేసిన రేవంత్ సర్కార్ అభాసుపాలవుతున్నది. రెండు లక్షల రూపాయల లోపు రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇవ్వడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశతో రైతులు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చాక రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తిరకాసు పెడుతున్నది. రుణమాఫీకి రైతులకు రేషన్ కార్డులు లేవని, ఒకే కుటుంబంలో ఇద్దరికి ఇవ్వలేమని, తదితర కారణాలతో కొర్రీలు పెడుతున్నది. సూర్యాపేట జిల్లాలో ఇప్పటి వరకు 51 శాతానికి మించి రుణమాఫీ చేయలేదు. జిల్లాలో రుణాలు తీసుకున్న 2.60 లక్షల మంది రైతులు సుమారు రూ.3,350 కోట్ల రుణాలు తీసుకున్నారు. దీంట్లో రెండు లక్షల రూపాయల లోపు తీసుకున్న వారే 90 శాతం మంది ఉన్నారు. 1.60 లక్షలకు పైన రుణాలు తీసుకోవాలంటే నిబంధనల మేరకు షూరిటీలు ఇవ్వాల్సి ఉండడంతోపాటు వడ్డీ రేటు కూడా మారుతుందని, అందుకే రెండు లక్షలు దాటి రుణాలు తీసుకునే రైతుల సంఖ్య వేళ్లపై లెక్కేసేంత మంది ఉంటారని ఓ బ్యాంక్ అధికారి తెలిపారు. ఈ లెక్కన జిల్లాలో సుమారు 2.35లక్షల మంది రైతులు రెండు లక్షల లోపు రుణాలు తీసుకొని ఉంటారని, అంతా కలిపి దాదాపు రూ.3 వేల కోట్ల వరకు ఉంటుందని సదరు అధికారి అంచనా వేశారు. తొలి విడుతగా లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు జిల్లాలో 56,217 మంది ఉన్నట్లు గుర్తించి రూ.282.98 కోట్లు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెండో విడుతలో 26,437 మంది రైతులకు రూ.250 కోట్లు, మూడో విడుతలో 17,870 మంది రైతులకు రూ.305 కోట్లు మాఫీ అయినట్లు చెప్పింది. మూడు విడతలు కలిపి జిల్లాలో 1,00,583 మంది రైతులకు రూ.837 కోట్లు మాఫీ చేసినట్లు లెక్క. దీని ప్రకారం మరో 1.35 లక్షల మంది రైతులకు దాదాపు రూ.2 వేల కోట్లు మాఫీ కావాల్సి ఉందని తెలుస్తుంది.

మాఫీ చేయకపోవడంతో ప్రతినెలా రూ.17 కోట్ల అదనపు భారం

ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేయకపోవడంతో జిల్లా రైతులపై వడ్డీ రూపంలో ప్రతి నెలా రూ.17 కోట్ల భారం పడుతున్నది. 9శాతం వడ్డీ చొప్పున రూ.రెండు వేల కోట్లకు నెలకు రూ.17 కోట్లు అవుతున్నది. రుణమాఫీ ఆగస్టులో చేయకపోవడంతో మూడు నెలలు గడిచిపోయింది. ఈ మూడు నెలలు కలిపి రూ.51 కోట్ల వడ్డీ భారం రైతులపై పడుతున్నది. ప్రభుత్వం రుణమాఫీని పూర్తి స్థాయిలో ఎప్పుడు చేస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వడ్డీ పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని మోయడం తమ వల్ల కాదని, తక్షణమే ప్రభుత్వం వందశాతం రుణమాఫీ చేయడంతో పాటు మూడు నెలల వడ్డీని కూడా చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వడ్డీని ప్రభుత్వమే భరించాలి

నేను కెనరా బ్యాంకులో ఒక లక్షా తొంభై వేల రూపాయలను అప్పుగా తీసుకున్నాం. రుణమాఫీ విషయంపై బ్యాంకుకు వెళ్తే లిస్టులో నీ పేరు లేదన్నారు. వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్తే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెల రోజుల క్రితం మళ్లీ దరఖాస్తు చేసుకున్నాను. ఆ తర్వాత బ్యాంకు, వ్యవసాయ అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. ఇప్పటికి వడ్డీ పెరిగి చాలా ఇబ్బంది పడుతున్నా. అసలు, వడ్డీ నాలాంటి పేద రైతు కట్టలేని పరిస్థితి. వెంటనే రైతులకు పూర్తిగా రుణమాఫీ చేసి పెరిగిన వడ్డీ కూడా ప్రభుత్వమే భరించాలి.

-గుంటి రవికుమార్, రైతు, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం

రుణమాఫీపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

అధికారంలోకి వస్తే రుణమాఫీ వెంటనే అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. వ్యవసాయ అవసరం కోసం నేను గతంలో మేళ్ల చెర్వు గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షల లోన్ తీసుకున్నా. వడ్డీ చెల్లిస్తే వెంటనే రుణమాఫీ చేస్తారని చెప్పడంతో గత ఆగస్టులో రూ. 39 వేల వడ్డీ చెల్లించాను. ఇప్పటికీ మూడు నెలలు కావస్తున్నా నాకు రుణమాఫీ కాలేదు. మళ్లీ వడ్డీ పెరిగిపోతుంది. ఇది మాలాంటి సన్నకారు రైతులకు పెనుభారంగా మారుతుంది. ప్రభుత్వం వెంటనే అర్హులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి.

- జనిగ సైదులు, రైతు, మాజీ ఎంపీటీసీ, మేళ్ల చెర్వు

పంట చేతికి అంది వచ్చింది.. ఇంకా రుణ మాఫీ కాలేదు

నాకు మా గ్రామ శివారులో ఉన్న 3.39 ఎకరాల వ్యవసాయ భూమిపై సూర్యాపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2 లక్షల 15 వేలు రుణం తీసుకున్న. రుణ మాఫీ అవుద్దని ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నం. మొదటి విడుతలో కాలేదు. రెండో విడుతలోనైనా అవుద్దనుకున్నా. కానీ మూడో విడుతలో కూడా నాపేరు లేదు. బ్యాంకులో అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఎక్కువ తక్కువలతో సంబంధం లేకుండా రైతులందరికీ వంద శాతం రుణమాఫీ చేసి ఆదుకోవాలి. రైతు భరోసా పెట్టుబడి సాయం ఇంకా ఇవ్వలేదు. అప్పులు చేసి నాట్లు వేసినం, ఎరువులు కూడా అప్పులు చేసి తెచ్చుకున్నం. ఇప్పుడు పంట చేతికి అంది వచ్చింది. కానీ మాకు మాత్రం రుణ మాఫీ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి మమ్ములను ఆదుకోవాలి.

-ఎక్కటి శ్యాంసుందర్ రెడ్డి, రైతు గుంజలూరు, చివ్వెంల



నిడమనూరు : వల్లభాపురంలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ త్రిపాఠి

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఎన్యూమరేట్ల సర్వే తీరుపై కలెక్టర్ సీరియస్
- తుమ్మడం సూపర్‌వైజర్ తొలగింపునకు ఆదేశాలు

నిడమనూరు, నవంబర్ 12 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మరోమారు అవగాహన కల్పించి సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నిడమనూరు మండలంలోని నిడమనూరు, వల్లభాపురం, తుమ్మడం, రాజన్నగూడెం గ్రామాల్లో సర్వే తీరును మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వల్లభాపురం, తుమ్మడం గ్రామాల్లో సర్వే నెమ్మదిగా సాగుతుండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. తుమ్మడంలో 3 రోజుల్లో 30 ఇండ్లు మాత్రమే సర్వే చేయడం పట్ల సూపర్‌వైజర్ శ్రీనివాస్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ ఆయనను మార్చి పారితోషికాన్ని నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. రాజన్నగూడెంలో కుటుంబ యజమానుల నుంచి వివరాలను సేకరించడంలో ఇబ్బందులు పడుతున్న ఎన్యుమరేటర్ గంగరాజు పరిస్థితిని గమనించి మరోమారు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే సందర్భంగా ఇండ్లలో ఎవరైనా లేనట్లయితే రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సర్వేలో వివరాలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఊట్కూరు లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎంపీడీఓ జి. వెంకటేశం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా ఏఈలు సాయి ప్రసాద్, వెంకన్న, ఏఓ మునికృష్ణయ్య, ఎంఈఓ లావూరి వెంకన్న తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

హాలియా : ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మహేంద్ర చింట్లు సన్నరకం ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని రైతులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ మంగళవారం హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం రాశులను ఆమె పరిశీలించారు. ఐకేపీ సిబ్బందితోపాటు రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 68 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంకొనుగోలు చేశామని, రూ.20 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో అదనపు గోదాములు నిర్మించాలని మార్కెట్ చైర్మన్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హాలియా 6వ వార్డులో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, మిల్లర్స్ చిట్టిపోలు యాదగిరి, తాసీల్దార్ రఘు, ఏఓ సరిత, సీఈఓ సత్యం, ఎంపీడీఓ సుజాత, నాయకులు కాకునూరి నారాయణ, నాగిరెడ్డి మార్కెట్ సిబ్బంది తదితరులున్నారు.